# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన


- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 293 మంగళవారం 28 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# ఆంధ్రుల ఆరాధ్యదైవం





## నటసార్వభౌముడు ఎన్‌టిఆర్

## అన్న మన తారక రాముడు

## నేడు ప్రపంచ వ్యాప్తంగా జయంతి వేడుకలు

సిసలైన ప్రజా నాయకుడు ఎన్టీఆర్. ఆంధ్రప్రదేశ్‌లో ఆయన సమకాలికుల్లో ఆయనంతటి ప్రజా నాయకుడు మరొకరు లేరు. వట వృక్షంలాంటి కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో ధీటైన ప్రత్యామ్నాన్ని నిలబెట్టిన గొప్పదనం పూర్తిగా ఎన్టీఆర్‌దే. పట్టుదలకు, క్రమ శిక్షణకు మారు పేరైన వ్యక్తి ఆయన. ఈ కారణాల వలనే ఆయన స్థిరమైన ప్రభుత్వాన్ని, ప్రభావవంతమైన ప్రతిపక్షాన్ని రాష్ట్ర ప్రజలకు ఇవ్వగలిగారు. తెగులు జాతికి, తెలుగు భాషకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. నేడు ఆయన జయంతి సంధర్బంగా షణ్ముఖ వెలుగు అందిస్తున్న ప్రత్యేక కథనం..


-2లో




## ఖర్గేను కాంగ్రెస్ సాగనంపడం ఖాయం

- కేంద్ర హోం మంత్రి, బీజేపీ స్టార్ క్యాంపెయినర్ అమిత్‌షా
- ఎన్నికల ఓటమికి ఆ ఇద్దరి కవలలను బాధ్యులను చేయరు
- వారిపై ఎలాంటి నింద రాకుండా ఖర్గేనే బాధ్యుడిని చేసి ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తారు
- ఐదు విడతల పోలింగ్‌పై వివరాల తన వద్ద వద్ద ఉన్నాయి

# గ్యారేజీకి మేడిగడ్డ

- కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ బీఆర్ఎస్ అధికారంలో ఉండగానే కుంగింది.
- ప్రభుత్వం మారడంతో ఇప్పుడు 7వ బ్లాక్ మరమ్మతులపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి
- తాజాగా 7వ బ్లాక్‌లోని 16వ నంబర్ గేటు ఎత్తు తుండగా భూగర్భంలో పెద్ద శబ్దాలు
- ఏడవ బ్లాక్ పియర్ కింద భారీ బుంగ పడి ఉంటుందని నిపుణుల అంచనా
- 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో భారీ బొరియ ఏర్పడి ఉండొచ్చని జియో ఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల ద్వారా అంచనా



కరీంనగర్

తెలంగాణ ప్రాణంగా బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ బీఆర్ఎస్ అధికారంలో ఉండగానే కుంగింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ఇదీ ఒక కారణం. బ్యారేజీలోని 7వ బ్లాక్ కుంగి దాదాపు పది నెలలు కావస్తోంది. ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడంతో ఇప్పుడు 7వ బ్లాక్ మరమ్మతులపై కాంగ్రెస్ సర్కార్ దృష్టిపెట్టింది. ఈ క్రమంలో కుంగిన గేట్లను ఎత్తే ప్రయత్నం చేస్తోంది. తాజాగా బుధవారం 7వ బ్లాక్‌లోని 16వ నంబర్ గేటు ఎత్తు తుండగా భూగర్భంలో పెద్ద శబ్దాలు వినిపించాయి. ప్రకంపనలు కూడా వచ్చాయి. దీంతో పనులు ఆపేశారు. పెద్ద శబ్దాల


-మిగతా3లో




# ప్రశాంతంగా పోలింగ్

### తెలంగాణలో ముగిసిన గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్

### ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

### 4 గంటల వరకే క్యూలైన్లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం

### జూన్ 5న ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు

హైదరాబాద్

తెలంగాణాలోని ఉమ్మడి వరంగల్-నల్గొండ-ఖమ్మం గ్రాడ్యుయేట్స్ కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నిక ముగిసింది. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ సమయం ముగియగా... అప్పటికే వరుసలో నిలబడిన వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో 34 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ జరిగింది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. జూన్ 5వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. మూడు జిల్లాల్లో 4,63,839 మంది ఓటర్లు ఉన్నారు. 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నిక నిర్వహించారు. బరిలో 52 మంది ఉన్నారు. మూడువేల సిబ్బంది


-మిగతా3లో


# కేజ్రీవాల్‌కు క్యాన్సర్ లక్షణాలు?

- ఢిల్లీ మంత్రి అతిషీ కీలక వ్యాఖ్యలు
- కేజ్రీవాల్‌లో కనిపిస్తోన్న లక్షణాలు తీవ్ర కిడ్నీ సమస్యలు లేదా క్యాన్సర్‌ను సూచిస్తున్నాయన్న అతిషి
- వైద్య పరీక్షల్లో కీటోన్ స్థాయి చాలా ఎక్కువగా ఉందని తేలినట్లు వెల్లడి
- వైద్యుల పరిశీలనలో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ బరువు పెరగడం లేదన్న మంత్రి



# ఆంధ్రుల ఆరాధ్యదైవం



నందమూరి తారక రామారావు తండ్రి లక్ష్మయ్య చౌదరి, తల్లి వెంకట్రావమ్మ. 1923 మే 28 కృష్ణా జిల్లాలోని నిమ్మకూరులో జన్మించారు. ఆయనే విశ్వ విఖ్యాత నట సార్వభౌమ ఎన్‌టిఆర్. ఆయన సినిమా నటుడు, సినిమా దర్శకుడు, నిర్మాత, రాజకీయ నాయకుడు, రంగస్థల నటుడు. భార్య బసవతారకం. ఆయనకు జయకృష్ణ, సాయికృష్ణ, హరికృష్ణ, మోహనకృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ కుమారులు. గారపాటి లోకేశ్వరి, దగ్గుబాటి పురంధేశ్వరి, నారా భువనేశ్వరి, కంటమనేని ఉమామహేశ్వరి కుమార్తెలు. పాఠశాల విద్య విజయవాడ మున్సిపల్ హైస్కూలులో చదివాడు. తరువాత విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజీలో చేరాడు. ఇక్కడ విశ్వనాథ సత్యనారాయణ తెలుగు విభాగానికి అధిపతి. ఒకసారి రామారావును ఒక నాటకంలో ఆడవేషం వేయమన్నాడు. అయితే రామారావు తన మీసాలు తీయటానికి ససేమిరా అన్నాడు. మీసాలతోటే నటించడం వలన ఆయనకు మీసాల నాగమ్మ అనే పేరు తగిలించారు. 1942 మే 23వ తేదీ సాయంత్రం 3.23 నిమిషాలకు 20 ఏళ్ళ వయసులో మేనమామ కుమార్తె బసవ రామతారకంను పెళ్ళి చేసుకున్నాడు. వివాహ విద్యానాశాయ అన్నట్లు పెళ్ళయిన తరువాత పరీక్షల్లో రెండుసార్లు తప్పాడు. తర్వాత గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో చేరాడు. అక్కడ కూడా నాటక సంఘాల కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవాడు. ఆ సమయంలోనే నేషనల్ ఆర్ట్ థియేటర్ గ్రూప్ అనే నాటక సంస్థను స్థాపించి కొంగర జగ్గయ్య, ముక్కామల, నాగభూషణం, కెవిఎస్ శర్మ తదితరులతో చేసిన పాపం వంటి ఎన్నో నాటకాలు ఆడాడు. తర్వాత కాలంలో ఈ సంస్థ కొన్ని చిత్రాలను కూడా నిర్మించింది. ఎన్టీఆర్ మంచి చిత్రకారుడు కూడా. రాష్ట్ర వ్యాప్త చిత్రలేఖన పోటీలలో ఆయనకు బహుమతి కూడా లభించింది. సుభాష్ చంద్రబోసు విజయవాడ వచ్చినప్పుడు ఎన్టీఆర్ బోసు బొమ్మను చిత్రించి ఆయనకు కానుకగా ఇచ్చాడు. రామారావు కాలేజీలో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు వారి ఆస్తి మొత్తం ఏవో కొన్ని కారణాల వల్ల హరించుకుపోయింది. అప్పుడు యుక్తవయసులో ఉన్న రామారావు జీవనం కోసం అనేక పనులు చేసాడు. కొన్ని రోజులు పాల వ్యాపారం, తరువాత కిరాణా కొట్టు, ఆపై ఒక ముద్రణాలయాన్ని కూడా నడిపాడు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అప్పు చేసేవాడు కాదు. రామారావు 1947లో పట్టభద్రుడయ్యాడు. తదనంతరం ఆయన మద్రాసు సర్వీసు కమీషను పరీక్ష రాసాడు. పరీక్ష రాసిన 1100 మంది నుండి ఎంపిక చేసిన ఏడుగురిలో ఒకడుగా నిలిచాడు. అప్పుడు ఆయనకు మంగళగిరిలో సబ్ రిజిస్ట్రారు ఉద్యోగం లభించింది. అయితే సినిమాలలో చేరాలనే ఆశయం కారణంగా ఆ ఉద్యోగంలో మూడు వారాల కంటే ఎక్కువ ఉండలేకపోయాడు. ప్రముఖ నిర్మాత బిఏ సుబ్బారావు ఎన్టీఆర్ ఫోటోను ఎల్వీ ప్రసాద్ దగ్గర చూసి వెంటనే ఆయనను మద్రాసు పిలిపించి పల్లెటూరి పిల్ల సినిమాలో కథానాయకుడిగా ఎంపిక చేసాడు. దీనికి గాను రామారావుకు వెయ్యి నూటపదహార్ల పారితోషికం లభించింది. వెంటనే ఆయన తన సబ్ రిజిస్ట్రారు ఉద్యోగానికి రాజీనామా చేసేసాడు. కానీ సినిమా నిర్మాణం వెంటనే మొదలవలేదు. ఈలోగా మనదేశం అనే సినిమాలో అవకాశం రావడంతో దానిలో నటించాడు. అంచేత ఆయన మొదటిసారి కెమేరా ముందు నటించిన సినిమా మనదేశం అయింది. 1949లో వచ్చిన ఆ సినిమాలో ఆయన ఒక పోలీసు ఇన్స్‌పెక్టర్ పాత్ర పోషించాడు. 1950లో పల్లెటూరి పిల్ల విడుదలైంది. అదే సంవత్సరం ఎల్వీ ప్రసాద్ షావుకారు కూడా విడుదలైంది. ఈ రెండు సినిమాల తరువాత ఎన్టీఆర్ తన నివాసం మద్రాసుకు మార్చివేశాడు. థౌజండ్ లైట్స్ ప్రాంతంలో ఒక చిన్న గదిని అద్దెకు తీసుకొని అందులో ఉండేవాడు. ఆయనతో పాటు ఆ గదిలో యోగానంద్ (తరువాతి కాలంలో నిర్మాత అయ్యాడు) కూడా ఉండేవాడు. 1951లో కెవి రెడ్డి పాతాళభైరవి, దాని తరువాత అదే సంవత్సరం బిఎన్ రెడ్డి మల్లీశ్వరి, 1952లో ఎల్వీ ప్రసాద్ పెళ్ళిచేసి చూడు, ఆ తరువాత వచ్చిన కమలాకర కామేశ్వరరావు చిత్రం చంద్రహారం ఆయనకు నటుడిగా గొప్ప కీర్తిని సంపాదించి పెట్టాయి. ఈ సినిమాలన్నీ విజయావారివే. ప్రతీ సినిమాకు నెలకు 500 రూపాయిలు జీతం, 5000 రూపాయిల పారితోషికమూ ఇచ్చారు. పాతాళభైరవి 34 కేంద్రాలలో 100 రోజులు ఆడి అప్పట్లో సంచలనం సృష్టించింది. తన ఉంగరాల జుట్టుతో, స్ఫురద్రూపంతో, వెలుగులు విరజిమ్మే నవ్వుతో ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఆకట్టుకుని వారి మనసుల్లో నిలిచిపోయాడు. 1956లో విడుదలైన మాయాబజార్‌లో ఆయన తీసుకున్న 7500 రూపాయల పారితోషికం అపట్లో అత్యధికం అని భావిస్తారు. 1959లో ఏవియం ప్రొడక్షన్స్ వారు నిర్మించి, విడుదల చేసిన భూకైలాస్ చిత్రంలో రావణబ్రహ్మ పాత్రకు రామారావు ప్రాణప్రతిష్ఠ చేసాడు. 1960లో విడుదలయిన శ్రీ వెంకటేశ్వర మహాత్యం భారీ విజయం సాధించింది. శ్రీమద్విరాటపర్వంలో ఆయన ఐదు పాత్రలు పోషించాడు. ఆ విధంగా 1950లలో ఎన్టీఆర్ ఎంతో ప్రజాదరణ పొందిన నటుడిగా ఎదిగాడు. సంవత్సరానికి 10 సినిమాల చొప్పున నటిస్తూ ఉండేవాడు. 1963లో విడుదలైన లవకుశ అతి పెద్ద విజయాన్ని నమోదు చేసింది. ఎన్టీఆర్ సినిమాల్లోకి వచ్చిన 22 సంవత్సరముల వరకు ఆయన పారితోషికం 4 లేదా 5 అంకెల్లోనే ఉండేది. 1972 నుంచి ఆయన పారితోషికం లక్షల్లోకి చేరింది. ఎన్టీఆర్ దర్శకత్వంలో వచ్చిన మొదటి చిత్రం 1961లో విడుదలైన సీతారామ కళ్యాణం. ఈ చిత్రాన్ని తన సోదరుడు త్రివిక్రమరావు ఆధీనంలోని నేషనల్ ఆర్టు ప్రొడక్షన్సు పతాకంపై విడుదల చేసాడు. 1977లో విడుదలైన దాన వీర శూర కర్ణలో ఆయన మూడు పాత్రల్లో నటిస్తూ స్వయంగా దర్శకత్వం చేసాడు. 1978లో విడుదలైన శ్రీరామ పట్టాభిషేకం సినిమాకు కూడా ఆయన దర్శకత్వం వహించాడు. ఎన్టీఆర్ నటించిన సాంఘిక చిత్రాలు అడవిరాముడు, యమగోల గొప్ప బాక్సాఫీసు విజయం సాధించాయి. 1991 ఎన్నికల ప్రచారం కోసం ఆయన నటించి, దర్శకత్వం వహించిన బ్రహ్మర్షి విశ్వామిత్ర 1990లో విడుదలైంది. ఎన్టీఆర్ క్రమశిక్షణలో చాలా కచ్చితంగా ఉండేవాడు. గంభీరమైన తన స్వరాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ మద్రాసు మెరీనా బీచ్‌లలో అభ్యాసం చేసేవాడు. నర్తనశాల సినిమా కోసం ఆయన వెంపటి చినసత్యం దగ్గర కూచిపూడి నేర్చుకున్నాడు. వృత్తిపట్ల ఆయన నిబద్ధత అటువంటిది. కెమెరా ముందు ఎన్టీఆర్ తడబడిన దాఖలాలు లేవని చెబుతూంటారు. ఎందుకంటే ఆయన డైలాగులను ముందుగానే కంఠతా పట్టేసేవాడు.

### రాజకీయ ప్రవేశం....

1978లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారానికి వచ్చిన కాంగ్రెసు పార్టీ అంతర్గత కుమ్ములాటల వలన అపకీర్తి పాలయ్యింది. తరచూ ముఖ్యమంత్రులు మారుతూ ఉండేవారు. ఐదు సంవత్సరాల కాలంలో నలుగురు ముఖ్యమంత్రులు మారారు. ముఖ్యమంత్రిని ఢిల్లీలో నిర్ణయించి, రాష్ట్రంలో శాసనసభ్యుల చేత నామకార్థం ఎన్నిక చేయించేవారు. ఈ పరిస్థితి కారణంగా ప్రభుత్వం అప్రదిష్ట పాలయింది. నందమూరి బసవతారకం రామారావుతో ఒక్కమాట ప్రజలకు న్యాయం చేయాలంటే, మీరు రాజకీయాలలోకి రావాలి కదా అన్నారు. 1981లో ఊటీలో సర్దార్ పాపారాయుడు చిత్రం షూటింగు విరామసమయంలో ఒక విలేఖరి, మీకు ఇంకో 6 నెలల్లో 60 సంవత్సరాలు నిండుతున్నాయి కదా, మరి మీ జీవితానికి సంబంధించి ఏదైనా నిర్ణయం తీసుకుంటున్నారా అని అడిగాడు. దానికి జవాబుగా నేను నిమ్మకూరు అనే చిన్న గ్రామంలో పుట్టాను. తెలుగు ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు. వారికి నేనెంతో రుణపడి ఉన్నాను. కాబట్టి నా తరువాత పుట్టిన రోజు నుంచి నా వంతుగా ప్రతి నెలలో 15 రోజులు తెలుగు ప్రజల సేవ కోసం కేటాయిస్తాను అని చెప్పాడు. ఆయన చేయబోయే రాజకీయ ప్రయాణానికి అది మొదటి సంకేతం అని బసవతారకం అన్నారు. అప్పటి నుండి ఎన్టీఆర్ తాను నటించవలసిన సినిమాలు త్వరత్వరగా పూర్తి చేసాడు. 1982 మార్చి 21న హైదరాబాద్ వచ్చినప్పుడు అభిమానులు ఆయనకు ఎర్రతివాచీ పరిచి స్వాగతం పలికారు. 1982 మార్చి 29 సాయంత్రం 2:30 లకు కొత్త పార్టీ పెడుతున్నట్లు చెప్పాడు. ఆ సమయంలోనే తన పార్టీ పేరు తెలుగుదేశంగా నిర్ణయించి, ప్రకటించాడు. పార్టీ ప్రచారానికై తన పాత చెవ్రోలెటు వ్యానును బాగు చేయించి, దానిని ఒక కదిలే వేదికగా తయారు చేయించాడు. దాని పై నుండే ఆయన తన ప్రసంగాలు చేసేవాడు. దానిని ఆయన చైతన్యరథం అని అన్నాడు. ఆ రథంపై తెలుగుదేశం పిలుస్తోంది, రా..కదలి రా..అనే నినాదం రాయించాడు. ఆ తరువాత కాలంలో భారత రాజకీయాల్లో పరుగులెత్తిన ఎన్నో రథాలకు ఈ చైతన్య రథమే స్ఫూర్తి. ఎన్టీఆర్ ప్రజలను చైతన్య పరుస్తూ చైతన్య రథంపై ఆంధ్రప్రదేశ్ నలుమూలలకూ ప్రచార యాత్రను సాగించాడు. చైతన్య రథమే ప్రచార వేదికగా, నివాసంగా మారిపోయింది. ఒక శ్రామికుడివలె ఖాకీ దుస్తులు ధరించి, నిరంతరం ప్రయాణిస్తూ, ఉపన్యాసాలిస్తూ ప్రజల హృదయాలను దోచుకున్నాడు. ఆంధ్రుల ఆత్మగౌరవ పరిరక్షణ అనే ఒక ఉద్వేగభరితమైన అంశాన్ని తీసుకుని ప్రజల మనోభావాలను తీవ్రంగా ప్రభావితం చేసాడు. కాంగ్రెస్ అధికారాన్ని కూకటివేళ్ళతో పెకలించి వేసిన ప్రచార ప్రభంజనమది. ఎన్టీఆర్ ప్రసంగాలు ఉద్వేగభరితంగా, ఉద్రేకపూరితంగా ఉండి, ప్రజలను ఎంతో ఆకట్టుకునేవి. ముఖ్యమంత్రులను తరచూ మార్చడం, అదీ ఢిల్లీ పెద్దల నిర్ణయం ప్రకారమే తప్ప, శాసనసభ్యుల మాటకు విలువ లేకపోవడం వంటి వాటిని లక్ష్యంగా చేసుకుని తన ప్రసంగాలను మలచుకున్నాడు. కాంగ్రెస్ నాయకులు కుక్కమూతి పిందెలనీ, కొజ్జాలనీ, దగాకోరులనీ, దగుల్బాజీలని, అధిష్టానం చేతిలో కీలుబొమ్మలనీ తీవ్రపదజాలంతో విమర్శించాడు. కాంగ్రెస్ పార్టీ కారణంగా తెలుగువారి ఆత్మగౌరవం దెబ్బతిన్నదని, దాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని విమర్శిస్తూ, ఆ ఆత్మగౌరవ పునరుద్ధరణకే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పాడు. కాంగ్రెస్ నిర్వాకానికి అప్పటికే విసుగు చెందిన ప్రజలు ఆయన నినాదం పట్ల ఆకర్షితులయ్యారు. 1983 జనవరి 7న మధ్యాహ్నం ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. తెలుగుదేశం 199, కాంగ్రెసు 60, సిపిఐ 4, సిపిఎం 5, బిజెపి 3 సీట్లు గెలుచుకున్నాయి. 97 ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ 9 నెలల తెలుగుదేశం పార్టీ చేతుల్లో ఓడిపోయింది. ఆయన విజయానికి అప్పటి దినపత్రికలు ఎంతో తోడ్పడ్డాయి. 1970లో ఎదుర్కొన్న చిన్నపాటి ఒడిదొడుకులు తప్పించి, ఎన్టీఆర్ సినిమా జీవితం విజయవంతంగా, అప్రతిహతంగా సాగిపోయింది. అయితే ఆయన రాజకీయ జీవితం అలా నల్లేరు పై నడకలా సాగలేదు. అద్భుతమైన విజయాలకూ, అవమానకరమైన అపజయాలకూ మధ్య తూగుటూయలలా సాగింది. ఎన్నికల ప్రచార సమయంలో ఎన్టీఆర్ కాంగ్రెస్ నాయకులపై చేసిన ఆరోపణల కారణంగానూ, ఎన్నికల్లో తెలుగుదేశం చేతిలో కాంగ్రెస్ పొందిన దారుణ పరాభవం వల్లనూ, ఆ రెండు పార్టీల మధ్య వైరి భావం పెరిగింది. రాజకీయ పార్టీల మధ్య ఉండే ప్రత్యర్థి భావన కాక శతృత్వ భావన నెలకొంది. ఇది తెలుగుదేశం పాలిత ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ పాలిత కేంద్రానికి మధ్య వివాదంగా మారే వరకు వెళ్ళింది. కేంద్రం మిథ్య అనేంత వరకు ఎన్టీఆర్ వెళ్ళాడు. 1983 శాసనసభ ఎన్నికల్లో ఆయన సాధించిన అపూర్వ విజయం ఆయన రాజకీయ జీవితంలో అత్యున్నత ఘట్టం. అధికారం చేపట్టిన తరువాత అనేక వివాదాస్పద నిర్ణయాలు కూడా తీసుకున్నాడు. ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ తగ్గింపు వీటిలో ప్రధానమైనది. ఈ నిర్ణయాల కారణంగా చాలా వేగంగా ప్రజాభిమానం కోల్పోసాగాడు. 1984 ఆగష్టు 16న నాదెండ్ల భాస్కరరావు, అప్పటి గవర్నర్ రాంలాల్, ప్రధానమంత్రి ఇందిరా గాంధీల లోపాయికారీ సహకారంతో రామారావును అధికారం నుండి తొలగించి, తాను దొడ్డిదారిన గద్దెనెక్కడంతో తిరిగి రామారావు ప్రజల్లోకి వెళ్ళాడు. జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటాడు. ఈ ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో మిత్రపక్షాలు ఆయనకు ఎంతో సహాయం చేసాయి. ఫలితంగా సెప్టెంబర్ 16న రామారావును తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్ఠించడం కేంద్ర ప్రభుత్వానికి తప్పింది కాదు. నెల రోజుల్లోనే ఆయన ప్రభ తిరిగి శిఖరాగ్రానికి చేరిన సందర్భమిది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి కాంగ్రేసేతర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టాడు. 1984లో సినిమా రంగంలో స్లాబ్ విధానమును అమలు పరిచాడు. ప్రభుత్వానికి ఖర్చు తప్ప ఎందుకూ పనికిరాదని శాసన మండలిని రద్దు చేసాడు (1985 జూన్ 1న అధికారికంగా మండలి రద్దయింది). హైదరాబాదులోని హుస్సేన్ సాగర్ కట్టపై (ట్యాంకుబండ్ నందు) సుప్రసిద్ధులైన తెలుగువారి విగ్రహాలు నెలకొల్పాడు. నాదెండ్ల కుట్ర కారణంగా శాసనసభలో తనకు తగ్గిన ఆధిక్యతను తిరిగి సంపాదించే ఉద్దేశంతో మార్చి 1985లో ప్రజల తీర్పు కోరుతూ మధ్యంతర ఎన్నికలకు వెళ్ళాడు. ఆ ఎన్నికలలో 202 స్థానాల్లో గెలిచి తిరిగి అధికారంలోకి వచ్చాడు. 1985-89 మధ్య కాలంలో తన ఏకస్వామ్యపాలన వలన ఎన్టీఆర్ ఎంతో అప్రదిష్ట పాలయ్యాడు. పార్టీలోను, ప్రభుత్వంలోను అన్నీ తానే అయి నడిపించాడు. ప్రజల్లో నిరసన భావం కలగడానికి ఇది ప్రధాన కారణమైంది. 1989లో ఎన్నికలకు కొద్ది నెలల ముందు మొత్తం మంత్రివర్గాన్ని ఏకపక్షంగా రద్దుపరచి కొత్త మంత్రుల్ని తీసుకున్నాడు. ఈ కాలంలో జరిగిన కొన్ని కుల ఘర్షణలు కూడా ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసాయి. 1989 ఎన్నికల్లో ఇది తీవ్ర ప్రభావం చూపింది. కాంగ్రెస్ తెలుగుదేశాన్ని చిత్తుగా ఓడించి తిరిగి అధికారానికి వచ్చింది. ఎన్నికల్లో ఓడిపోయినా భారతదేశంలోని ప్రాంతీయ పార్టీలన్నిటిని కమ్యూనిస్టులతో కలిపి కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్ అనే ఒక సంకీర్ణాన్ని ఏర్పాటు చేయటంలో ఎన్టీఆర్ విజయం సాధించాడు. 1991లో నంద్యాల లోక్‌సభ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ తరపున అభ్యర్థిగా అప్పటి ప్రధానమంత్రి పివి నరసింహారావు నిలబడగా, ప్రధానమంత్రి అయిన ఒక తెలుగువాడికి గౌరవ సూచకంగా ఎన్టీఆర్ ఎవరినీ పోటీగా నిలబెట్టలేదు. 1989-94 మధ్యకాలం ఎన్టీఆర్ రాజకీయ చరిత్రలో అత్యంత నిమ్నదశగా చెప్పవచ్చు. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభలో అధికార కాంగ్రెస్ పార్టీ చేతిలో అవమానాలు పొందాడు. శాసనసభలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణ ఏ స్థాయిలో ఉండేదంటే ఈ కాలంలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ సభ్యులను 9 సార్లు సభనుండి బహిష్కరించారు. ఆ కాలంలో నాలుగు సినిమాలలో నటించాడు కూడా. తన జీవితకథ రాస్తున్న లక్ష్మీపార్వతిని 1993 సెప్టెంబరులో పెళ్ళి చేసుకున్నాడు. రామారావు వ్యక్తిగత జీవితంలో ఇదో కీలకమైన మలుపు. ఆయన వ్యక్తిగత జీవితం, కుటుంబ సభ్యులతో ఆయన సంబంధాలపై ఈ పెళ్ళి కారణంగా నీడలు కమ్ముకున్నట్లు కనిపించాయి. 1994లో కిలో బియ్యం రెండు రూపాయలు, సంపూర్ణ మధ్య నిషేధం, వంటి హామీలతో మునుపెన్నడూ ఏ పార్టీ కూడా సాధించనన్ని స్థానాలు గెలిచి మళ్ళీ అధికారంలోకి వచ్చాడు. ప్రభుత్వ ఖజానాకు ఎంత భారంపడినా కూడా ఎన్టీఆర్ తన హామీలను అమలు పరిచాడు. అయితే ఆయన రెండవ భార్య లక్ష్మీపార్వతి పార్టీ, ప్రభుత్వ విషయాలలో విపరీతంగా కలుగజేసుకోవటం వలన ఆయన చాలా సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చింది. పార్టీలో ప్రముఖులు అభద్రతా భావాన్ని ఎదుర్కొన్నారు. పార్టీలో ముదిరిన సంక్షోభానికి పరాకాష్ఠగా కొంత మంది తిరుగుబాటు చేసారు. అంతటితో ఎన్టీఆర్ రాజకీయ జీవితం ముగిసినట్లయింది. 1996 జనవరి 18న 73 సంవత్సరాల వయసులో గుండెపోటుతో ఎన్టీఆర్ మరణించాడు. ముప్పై మూడేళ్ళ తెర జీవితంలోను, పదమూడేళ్ళ రాజకీయ జీవితంలోను నాయకుడిగా వెలిగిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడు. ఆయన మరణించినపుడు ఈనాడు పత్రికలో శ్రీధర్ వేసిన కార్టున్ ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ పట్ల ఉన్న అభిమానానికి అద్దం పడుతుంది.



### ఎన్టీఆర్‌కు జాతీయ పురస్కారం..

ఎన్టీఆర్ పేరిట సినిమా ప్రముఖులకు జీవిత కాలంలో చేసిన సేవకు గుర్తింపుగా ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో నెలకొల్పింది. 2002 వరకు ఇస్తూ వచ్చిన ఈ అవార్డును ప్రభుత్వం తరువాత నిలిపివేసింది. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 2006 జనవరి 18న ఈ పురస్కారాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### అన్న ఎన్టీఆర్ విశిష్టత..

సిసలైన ప్రజానాయకుడు ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్‌లో ఆయన సమకాలికుల్లో ఆయనంతటి ప్రజానాయకుడు మరొకరు లేరు. వటవృక్షం లాంటి కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో దీటైన ప్రత్యామ్నా యాన్ని నిలబెట్టిన గొప్పదనం పూర్తిగా ఎన్టీఆర్‌దే. పట్టుదలకూ, క్రమశిక్షణకు మారుపేరైన వ్యక్తి ఆయన. ఈ కారణాల వల్లనే కాంగ్రెసు పార్టీని ఎదుర్కొని స్థిరమైన ప్రభుత్వాన్నీ, ప్రభావవంతమైన ప్రతిపక్షాన్ని రాష్ట్ర ప్రజలకు ఇవ్వగలిగారు. తెలుగుజాతికీ, తెలుగుభాషకూ దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. స్త్రీలకు ఆస్తిలో వాటా ఉండాలని చట్టం తెచ్చిన ఘనత రామారావుదే. బలహీన వర్గాలకు లక్షలాదిగా ఇళ్ళు కట్టించిన గొప్పతనం ఆయనకు దక్కింది. రెండు రూపాయలకే కిలో బియ్యం వాగ్దానం చేసి, ఎన్నో ఆ ర్థిక ఇబ్బందులకు ఓర్చి, తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారు. తెలుగు గంగ ప్రాజెక్టులో పట్టుబట్టి రాయలసీమ సాగునీటి అంశాన్ని చేర్చిన ఘనత కూడా ఎన్టీఆర్‌దే. దేశంలో ప్రధాన ప్రతిపక్షాలను ఒకతాటిపైకి తెచ్చిన నేత ఆయన. ఎందరో కొత్త వారిని, బాగా చదువుకున్నవారిని రాజకీయాలకు పరిచయం చేసి, ఒంటిచేత్తో వారిని గెలిపించిన ప్రజానాయకుడు ఆయన. దేవేందర్ గౌడ్, కె చంద్రశేఖరరావు మొదలైన నేతలు ఆయన పరిచయం చేసినవారే. నక్సలైట్లు కూడా దేశభక్తులే బ్రదర్ అంటూ సమర్థించటం ఒక విశేషం. మదరాసులో ఆయన వుండగా తిరుపతి వెళ్ళిన తెలుగు యాత్రీకులు మొక్కుబడిగా మదరాసు వెళ్ళి ఆయనను దర్శించుకుని వచ్చేవారు.

### కొన్ని సాహసోపేత నిర్ణయాలు..

మహిళలకు ఆస్తి హక్కు, వెనుకబడినకులాల వారికి రిజర్వేషన్లు, పురోహితులుగా ఎవరైనా ఉండవచ్చుననే అంశం రామారావుకి బాబాల, మాతల పిచ్చి లేదు. దేవునిపట్ల భక్తి ఉంది. బుద్ధునిపట్ల అపార గౌరవమున్నది. ముఖ్యమంత్రి కాగానే సుప్రసిద్ధ జర్నలిస్టు, ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావుని సాంస్కృతిక సలహాదారుగా వేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అప్పటిదాకా రెడ్డి కులం వారికి మాత్రమే అన్ని రాజకీయ పదవులను కట్టబెట్టడంతో ఎన్టీఆర్ మిగతా కులముల వారికి ఆశాకిరణం లాగా కనిపించారు. ఎన్టీఆర్ మొట్ట మొదటి సారిగా అన్ని కులముల వారికి ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలవారికి తెలుగుదేశం పార్టీలో ఉన్నత పదవులు కల్పించారు. అయన చేసిన కృషి ఫలితంగా ఈ నాటికి బడుగు, బలహీన వర్గాలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారు. తెలంగాణాలో బడుగు బలహీనవర్గాలని పట్టి పీడుస్తున్న పటేల్ పట్వారి వ్యవస్థలని రద్దు చేసి తెలంగాణాలోని బడుగు బలహీన వర్గాలకి ఆరాధ్యదైవంగా మారారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన జనతా వస్త్రాల పథకం కూడా అందరినీ ఆలోచింపజేసింది. సినీ రంగంలో ఆయన 302 సినిమాలు చేశారు. నాటికీ నేటికీ ఒకే ఒక్కడు నందమూరి తారక రామారావు. కాలం పరుగులు తీస్తున్నా నేటికీ కళ్లముందు కనిపించే మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్. తెలుగువారి గుండెల్లో ఆరని జ్యోతి ఎన్టీఆర్. మరచిపోని మధురస్మృతులే ఆయనకు షణ్ముఖ వెలుగు అందిస్తున్న నీరాజనం.

# ప్రశాంతంగా పోలింగ్..

-మొదటి పేజి తరువాయి

ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో నోటా ఆప్షన్ ఉండదు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. మూడు ఉమ్మడి జిల్లాల్లో 34 అసెంబ్లీ స్థానాల పరిధిలో పోలింగ్ జరిగింది. జూన్ 5వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ జరగనుంది. ఈ ఎన్నిక బరిలో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్), బీఆర్ఎస్ నుంచి రాకేష్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డి ఉన్నారు. మొత్తంగా 52 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో నిలిచారు.

**ప్రశాంతంగా పోలింగ్..**



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 4 గంటల వరకే 60 శాతం పోలింగ్ దాటింది. ఇంకా క్యూలైన్లలో చాలా మంది అభ్యర్థులు ఉన్నారు. వారి ఓటింగ్ పూర్తయితే.. పోలింగ్ శాతం మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే, 4 గంటల లోపు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వారికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను నల్లగొండ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నిక ఫలితాలను జూన్ 5వ తేదీన వెల్లడించనున్నారు.

# కూరలకు గాయాలు.. 50 దాటేసిన వెజిటబుల్స్

**హైదరాబాద్ :** కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రైతు బజార్లు, వారపు సంత, కూరగాయల మార్కెట్..ఎక్కడ చూసినా ధరల మోతే. సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతు న్నాయి..పెరిగిన ధరలతో సామాన్యులు తిప్పలు పడుతు న్నారు.. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.25 వరకు ధర పలుకుతుండగా వారాంతపు సంతల్లో కిలో రూ.60?80 పలుకుతున్నాయి. పచ్చిమిర్చి, చిక్కుడు సెంచరీ చేరువ అవుతుండగా.. బీన్స్ డబుల్ సెంచరీకి చేరువ అవుతుంది. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.100పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని సామాన్యులు వాపోతున్నారు.మిగిలిన కూరగాయల్ని కేజీ 50పైనే ఉన్నాయి.. ధరలు పెరుగుదలకు దిగుబడి లేకపోవటమే కారణమంటున్నారు వ్యాపారులు.. రీటైల్ మార్కెట్‌లో అయితే మరి అధిక ధరలకు అమ్ముతున్నారు వ్యాపారులు..దీంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. లంగాణలో కురిసిన అకాల వర్షాలు, మండుతున్న ఎండలు, తగ్గిన సాగువిస్తీర్ణంతో కూరగాయల ధరలు కొండెక్కాయి. క్కుడు కిలో ధర వంద రూపాయలకు చేరింది. బీన్స్ కిలో 150 రూపాయలకు పెరిగింది. కొన్ని కూరగాయల ధరలు సెంచరీ దాటాయి.హైదరాబాద్ నగరంలోని రైతుబజార్లు, వీక్లీ కూరగాయల సంతల్లో కూరగాయలు కొనడానికి వచ్చిన గృహిణులు ధరలు చూసి బెంబేలెత్తుతున్నారు. కిలోల చొప్పున కూరగాయలు కొనే గృహిణులు పావుకిలో, అరకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.తెలంగాణలో కురిసిన అకాల వర్షాలు, మండుతున్న ఎండలు, తగ్గిన సాగువిస్తీర్ణంతో కూరగాయల ధరలు కొండెక్కాయి. టమాటా ధరలు కిలో మార్కెట్ లో రూ.40లకు విక్రయిస్తుండగా షాపింగ్ మాల్స్ లో 50 రూపాయల ధర పలుకుతోంది. పచ్చిమిర్చి ధర కిలో 150 రూపాయలకు పెరిగింది. సాగునీటి కొరత వల్ల ఈ వేసవిలో పచ్చిమిర్చి దిగుబడి తగ్గింది. మార్కెట్ లోనూ కిలో పచ్చిమిర్చి 120రూపాయలకు విక్రయిస్తున్నారు. బీట్రూట్ కిలో ధర 43 రూపాయల నుంచి 59 రూపాయల దాకా పెరిగింది. ఆలుగడ్డ ధరలు కూడా 30 నుంచి 50 రూపాయల దాకా పెరిగిందిగతంలో చవకగా లభించిన క్యాప్సికం కిలో ధర 55 నుంచి 76 రూపాయలకు పెరిగింది. క్యాబేజీ కిలో ధర 30 నుంచి 54 రూపాయలకు, క్యాలీఫ్లవర్ 31 నుంచి 45 రూపాయలకు చేరింది. క్యారెట్ కిలో ధరల 41 నుంచి 68



రూపాయలకు పెరిగింది. కొబ్బరికాయల ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. 20 రూపాయలకు లభించే కొబ్బరికాయలు 41 రూపాయలకు పెరిగింది. మునక్కాయల ధర కూడా అనూహ్యంగా పెరిగింది. కొత్తిమీర, కరివేపాకు నుంచి గోంగూర, పాలకూర, తోటకూర, కోయ తోటకూర దాకా అన్ని ఆకు కూరల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. వంకాయ కిలో 33 రూపాయల నుంచి 50 రూపాయలకు చేరింది. బీరకాయలు, బెండకాయలు,పచ్చి బఠానా ఇలా ఒకటేమిటి అన్ని రకాల కూరగాయల ధరలు అనూహ్యంగా పెరిగాయి. 10రూపాయలకు లభించే నిమ్మకాయలకు ప్రస్థుతం 40 రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో పలు కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. సిద్ధిపేట, తూప్రాన్, భువనగిరి, మేడ్చల్, శంషాబాద్ తదితర హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో కూరగాయలు పండించే వారు. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో ఇతర దూర ప్రాంతాల నుంచి కూరగాయలను రవాణా చేసుకోవాల్సివస్తోంది. దీనివల్ల కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి కూరగాయలు మరో నెలరోజుల దాకా తక్కువగానే వస్తాయని కూరగాయల రైతు యాదయ్య చెప్పారు. తక్కువ కూరగాయలు రావడం వల్ల ధరలు అమాంతం పెంచక తప్పలేదని మరో రైతు భీం రెడ్డి పేర్కొన్నారు.తెలంగాణలో మండుతున్న ఎండలతో కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దీంతో కూరగాయల కొరత ఏర్పడటంతో ధరలు ఆకాశన్నంటాయి. హైదరాబాద్ నగరంలో రైతుబజార్లతో పాటు వారాంతపు సంతల్లోనూ కూరగాయల ధరలు అనూహ్యంగా పెరగడంతో తాము కొనేటట్టు లేదు, తినేటట్టు లేదని తార్నాకకు చెందిన రాయగిరి రజిత అనే గృహిణి ఆవేదనగా ‘ఫెడరల్ తెలంగాణ’కు చెప్పారు. కూరగాయల ధరలు గణనీయంగా పెరగడంతో వంటిల్లు నిర్వహణ భారం పెరిగిందని మరో గృహిణి టి భవానీ చెప్పారు.ఈ వేసవి చివర తెలంగాణలోని హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయలు తగ్గాయని బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ అధికారి కె నర్సింహారెడ్డి చెప్పారు. అకాల వర్షాలు, ఎండలతో దిగుబడులు తగ్గడంతో కూరగాయలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు.ఢిల్లీ నుంచి ఆలుగడ్డలు, రాంచీ నుంచి బిన్నీస్, జైపూర్ నుంచి టమాట లారీలు వస్తున్నాయని, దూరాభారం నుంచి కూరగాయలు తెప్పించుకోవాల్సి రావడం వల్ల రవాణ ఖర్చుల భారం వల్ల ధరలు అమాంతం పెరిగాయని బోయిన్ పల్లి కూరగాయల మార్కెట్ కమిషన్ ఏజెంటు గుంటి అజయ్ ‘ఫెడరల్ తెలంగాణ’కు చెప్పారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, కర్ణాటకలోని బెల్గాం నుంచి సన్న మిర్చి తెప్పించుకోవడం వల్ల రవాణ చార్జీలు పెరిగాయని అజయ్ పేర్కొన్నారు. ప్రతీ ఏటా బిన్నీస్, చిక్కుడు కాయలు కర్ణాటక నుంచి వస్తుంటాయని, కానీ ఈ ఏడాది సాగునీటి సమస్య వల్ల అక్కడ పండక ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూరగాయల లారీలు తెప్పిస్తున్నామని అజయ్ వివరించారు.హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో గతంలో రైతులు విస్తారంగా కూరగాయలు పండించే వారని తెలంగాణ హార్టికల్చర్ శాఖ మాజీ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి చెప్పారు.ప్రస్థుతం హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో రియల్ భూమ్ పెరగడం వల్ల కూరగాయలు తోటలు వేసిన భూముల్లో భవనాలు వెలుస్తున్నాయని, దీనివల్ల తెలంగాణలో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిందని వెంకట్రామిరెడ్డి చెప్పారు. కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గడం వల్ల కూరగాయలను ఉత్తరాది రాష్ట్రాల నుంచి తెప్పించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన వివరించారు.ఉత్పత్తి తగ్గిపోవడంతో కూరగాయల ధరలు ఉట్టెక్కాయి.ఇక ఇక ప్రస్తుతం అల్లం వెల్లుల్లి ధరలు కూడా మండిపోతున్నాయి. అల్లం ధర మార్కెట్లో బాగా పెరిగపోయింది. ఓపెన్ మార్కెట్లో ప్రస్తుతం అల్లం కేజి 250 నుంచి 300 రూపాయలు వరకు ఉంటుంది.. అలాగే రైతు బజార్లలో కొంటే 190 నుంచి 210 వరకు ఉంటుంది.

## జూన్ 2 వరకే ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్



-మొదటి పేజి తరువాయి

కోరారు. అలాగే, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కూడా ఒప్పించాలని ఏపీలోని ఇతర పార్టీలను లక్ష్మీనారాయణ కోరారు. 2034 వరకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను ఉంచాలని ఏపీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ ఇటీవల డిమాండ్ చేసిన విషయం తెలిసిందే..

**సీఎం రేవంత్ కీలక ఆదేశాలు..**

కాగా.. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా గడవు ముగుస్తున్న నేపథ్యంలో తెలంగాణలో ఏపీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని భవనాలను స్వాధీనం చేసుకోవాలని, ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న ఆస్తుల పంపకాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో ఏపీకి చెందిన పలువురు నేతలనుంచి ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ను మరింత కాలం పెంచాలన్న డిమాండ్ వినిపిస్తుండటంతో కేంద్రం నిర్ణయం ఎలాఉండనుంది అనేది ఆసక్తికరంగా మారింది.

# తెలంగాణలోకి కొత్త ‘బీర్లు’.. ప్రభుత్వ అనుమతి పొందిన సోమ్ డిస్టిలరీస్

**హైదరాబాద్ :** రాష్ట్రంలో బీర్ల కొరత ఏర్పడినట్లు వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. మద్యం దుకాణాల్లో బీర్లను అందుబాటులో ఉంచాలని పలువురు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసిన వార్తలను కూడా చేశాం. అయినా కూడా బీర్లు అందుబాటులో లేవు. అయితే తెలంగాణలోకి కొత్త బీర్లు రాబోతున్నారు. రాష్ట్రంలో తమ బీర్ బ్రాండ్‌లను సరఫరా చేయడానికి సోమ్ డిస్టిలరీస్ అనుమతి పొందింది. ఇక పవర్ 10000, బ్లాక్ ఫోర్ట్, హంటర్, వుడ్ పీకర్ బీర్లు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణలో రూ. 5000 కోట్ల లిక్కర్ స్కాం




జరిగినట్లు వార్తలు వచ్చాయి. గత రెండు, మూడు నెలలుగా బీర్లు దొరకకపోవడం వెనుక భారీ కుట్ర జరుగుతున్నట్లు పలు మీడియా సంస్థలు చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే. కమీషన్ బట్టి తెలంగాణలో కొత్త బ్రాండ్లకు గేట్లు తెరిచే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఎన్నికల ఫలితాల తర్వాత కొన్ని ప్రముఖ బ్రాండ్లు కనుమరుగై కొత్త బ్రాండ్లు వచ్చే అవకాశ ఉందని రాసుకొచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే మద్యం కొరత సృష్టించారు. ఇది సాకుగా చూపుతూ కొన్ని కొత్త బ్రాండ్లను పరిచయం చేసేందుకు, వాటి ద్వారా భారీగా కమీషన్ పొందేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసినట్లు సమాచారం.

# గ్యారేజీకి మేడిగడ్డ

-మొదటి పేజి తరువాయి

వెనుక ఏం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఏడవ బ్లాక్ పియర్ కింద భారీ బుంగ పడి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. దాని కారణంగానే గేటు ఎత్తుతుండగా శబ్దాలు వస్తున్నాయని భావిస్తున్నారు.గతంలో వచ్చిన వరదల కారణంగా బ్యారేజీ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయిందని బావిస్తున్నారు. దీనికారణంగా 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో భారీ బొరియ ఏర్పడి ఉండొచ్చని జియో ఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల ద్వారా అంచనావకు వచ్చారు. ఈ క్రమంలో టన్నులకొద్దీ బరువు ఉండే గేటు ఎత్తుతున్న క్రమంలో పునాదులపై ఒత్తిడి పడి శబ్దాలు వస్తున్నాయని పేర్కొంటున్నారు.ప్రస్తుత పరిస్థితిలో గేట్లు ఎత్తడం మంచిది కాదని ఇంజినీర్లు భావిస్తున్నారు. పునాదుల కింద ఏర్పడిన ఖాళీలు పూడ్చిన తర్వాతనే గేట్లు ఎత్తాలని నిర్ణయించారు. ఇప్పటికే నీటి లీకేజీలను ఆపేందుకు బ్యారేజీ కుంగిన వెంటనే 40 వేల ఇసుక బస్తాలు వేశారు. అయినా ఇప్పటికీ భారీ ఖాళీ ఉందని భావిస్తున్నారుమేడిగడ్డ బ్యారేజీ దిగువన ఇసుక కొట్టుకుపోవడంతో ఏర్పడిన ఖాళీ ప్రదేశం, ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉందన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కుంగిన ఏడు నంబర్ బ్లాక్ దిగువకే ఈ బొరియ పరిమితమై లేదని, మొత్తం బ్యారేజీ కింద ఖాళీ ప్రదేశం ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. దీనిపై స్పష్టత వచ్చాక నిపుణుల కమిటీ సూచన మేరకు ఇసుక, సిమెంటు మిశ్రమాన్ని పంపించి పూడ్చివేయాల్సి ఉంటుంది. మొదట ఖాళీ ప్రదేశం గుర్తించి దానిని పూడ్చిన తర్వాతనే మరమ్మతులు చేపట్టాలని నీటిపారుదల శాఖ భావిస్తోంది. ఈమేరకు అవసరమైన పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది.

## అత్యంత వైభవంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



కూడిన వినోదశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్యాంక్ బండ్‌పై పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశశం ఉన్నందున వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ట్యాంక్ బండ్‌పై అదిపోనున్న ఉత్సవాలు..**

ట్యాంక్ బండ్‌పై సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు రాష్ట్రంలోని అన్ని కళారూపాలతో పెద్దఎత్తున కార్నివాల్ నిర్వహించనున్నట్లు సీఎస్ వివరించారు. శిక్షణ పొందుతున్న 5000మంది పోలీస్ అధికారులు బ్యాండ్ ప్రదర్శన ఇవ్వనున్నారని చెప్పారు. ట్యాంక్ బండ్‌పై దాదాపు 80స్టాళ్లను ఏర్పాటు చేసి హస్త కళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన పలు వస్తువులతోపాటు నగరంలోని పేరొందిన హోటళ్లచే ఫుడ్‌స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిల్లల కోసం పలు క్రీడలతో కూడిన వినోదశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఆకర్షణీయమైన బాణసంచా ప్రదర్శన, లేజర్ షో ఉంటుందన్నారు. ట్యాంక్ బండ్‌పై పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశమున్నందున వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సమీక్షలో సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఆకర్షణీయమైన బాణసంచా ప్రదర్శన తోపాటు లేజర్ షో ఏర్పాటు చేశామని శాంతి కుమారి చెప్పారు. రాష్ట్ర అవతరణ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని సూచించారు. సమావేశంలో డీజీపీ రవీ గుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిశోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాస రాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, అడిషనల్ డీజీలు సంజయ్ కుమార్ జైన్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, నగర పోలీస్ అడిషనల్ కమిషనర్, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు, ఎన్‌పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్, హెచ్ ఎండీఏ అడిషనల్ కమిషనర్ ఆమ్రపాలి కాటా పాల్గొన్నారు.

## 60 ఏళ్లు పాలించిన వారు ఏమీ చేయకుండానే ఇదంతా బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లు చేశారా?: జగ్గారెడ్డి

దేశంలో... తెలంగాణలో 60 ఏళ్లు పాలించి వారు ఏమీ చేయకుండానే ఇదంతా బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లే చేశారా? అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పార్టీ పెంచితే... వాటిని ప్రయివేటువారికి బీజేపీ ధారాదత్తం చేసిందని విమర్శించారు. 70 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూరమన్నారు. నాగార్జునసాగర్, బాక్రానంగల్ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్సే అన్నారు. హైదరాబాద్‌కు సాగునీటిని అందించేందుకు జంట జలాశయాలు నిర్మించింది తమ పార్టీయే అన్నారు. సింగూరు, మంజీరా నీళ్లు బీజేపీ నేతలు తాగడం లేదా? అని నిలదీశారు. హైదరాబాద్‌కు వస్తోన్న తాగునీళ్లు కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల నుంచే వస్తున్నాయన్నారు. 17 ఏళ్ల నెహ్రూ కాలంలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించామన్నారు. ఒక్క డ్యాం కూడా కట్టని ప్రధాని... ప్రాజెక్టుల గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. బీజేపీ ఈ పదేళ్లలో ఎన్ని పరిశ్రమలు తెచ్చింది? ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? అని నిలదీశారు. బీజేపీ హయాంలో పెట్రోల్, డీజిల్, బంగారం.. ఇలా అన్ని ధరలూ పెరిగాయని విమర్శించారు.

**కాంగ్రెస్ పార్టీలోనే పదవి అడిగే స్వేచ్ఛ**

పీసీసీ అధ్యక్ష పదవిని అడిగే స్వేచ్ఛ కాంగ్రెస్ పార్టీలో మాత్రమే ఉంటుందన్నారు. బీజేపీలో ఢిల్లీకి వెళ్లి అడిగే స్వేచ్ఛ ఉండదని... ఇక బీఆర్ఎస్‌లో అయితే మరొకరికి అవకాశమే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో అయితే ఎవరైనా అడగవచ్చునని చెప్పారు.

## శ్రీధర్ రెడ్డి హత్యపై సమగ్ర విచారణ జరిపించాలి.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్



**హైదరాబాద్ :** కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని చిన్నంబావి మండలం లక్ష్మిపల్లికి చెందిన బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డీజీపీని కలిశారు. శ్రీధర్ రెడ్డి హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు చేశారు. శ్రీధర్ రెడ్డి హత్య జరిగి నాలుగు రోజులైనా ఎవరినీ అరెస్టు చేయలేదు. మంత్రి జూపల్లి మీద ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోలేదు. వారం రోజుల్లో న్యాయం జరగకపోతే ఆందోళనలు చేస్తాం అని ఆర్ఎస్పీ హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడుంది న్యాయం అని ప్రశ్నించారు. మంత్రి జూపల్లి అనుచరులను కనీసం ప్రశ్నించలేదు. దోషులను జైల్లో పెట్టాలని శ్రీధర్ రెడ్డి తండ్రి కోరుతున్నారు. హత్య జరుగుతుందని చిన్నంబావి ఎస్ఐకి ముందే తెలుసు. అయినప్పటికీ ఎస్ఐ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రేవంత్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు నెత్తుటేర్లు పారిస్తున్నారు. ఇంత జరిగినా జూపల్లిపై చర్యలేవి..? అసలు రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా..? ముఖ్యమంత్రే హెూంమంత్రిగా ఉన్నాడు. సామాన్యులకు రక్షణ కల్పించకపోతే హెూం మంత్రి ఎందుకు..? చిన్నంబావి ఎస్ఐ, మంత్రి జూపల్లి చెప్పుచేతల్లో ఉన్నారు. జూపల్లితో కుమ్మక్కైన పోలీసులను డిస్మిస్ చేయాలి. శ్రీధర్ రెడ్డిని చంపిన నిందితుడు నిన్న మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంట్లో కూర్చొని ప్రెస్ మీట్ పెట్టాడు. నిందితులు మీ ఇంట్లోనే ఉంటే ఇంక బాధిత కుటుంబానికి న్యాయం ఏం చేస్తావు. మంత్రి జూపల్లిని బర్తరఫ్ చేయాలి. న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తాం అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

## టీపీసీసీ ఎవరికి దక్కేనో

**హైదరాబాద్ :** తెలంగాణలో టీపీసీసీ పదవి రేసులో చాలా మంది నేతలు అధిష్టానం వద్ద క్యూ కడుతున్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు టీపీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో టీపీసీసీ అధ్యక్ష పదవిపై చాలా మంది నేతలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. మొన్నటి వరకు తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో టీపీసీసీ చీఫ్ గా సీఎం రేవంత్ రెడ్డినే కొనసాగించింది కాంగ్రెస్ అధిష్టానం. పైగా పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలకు గానూ 14 నియోజకవర్గాల్లో విజయం సాధించాలని టార్గెట్ ఇచ్చినట్లు వార్తలు వినిపించాయి. దీంతో అన్నీతానై ప్రచార బాధ్యతలు నిర్వహించారు సీఎం రేవంత్ రెడ్డి. ఇక ఆ ఎన్నికలు ముగిసి 10 రోజులు గడిచిపోయింది. ఎన్నికల ఫలితాలు కూడా జూన్ 4న రానున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుని పదవీ బాధ్యతల నుంచి సీఎం రేవంత్ నిష్క్రమించే అవకాశం ఉంది.

# ఈ సారి సాధారణ కంటే ఎక్కువగానే వానలు

నైరుతి రుతుపవనాలు చురుగ్గా ముందుకు కదులుతున్నాయని.. కేరళలలో రుతుపవనాల ప్రవేశానికి అనుకూల వాతావరణం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. జూన్ ఒకటి నాటికి నైరుతి రుతుపవనాలు కేరళను తాకుతాయని పేర్కొంది. మరో ఐదురోజుల్లో కేరళలో ప్రవేశించి.. పుదుచ్చేరి, తమిళనాడులోని పలు ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయని చెప్పింది. అయితే, గతంలో మే 31నే కేరళను చేరుతాయని అంచనా వేసిన విషయం తెలిసిందే. కేరళలో రుతుపవనాలకు ముందే భారీ వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు ఉత్తరం వైపు కదులుతూ.. సాధారణంగా వేసవి ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగిస్తుందని పేర్కొంది. ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మొహపాత్ర మాట్లాడుతూ విలేకరులతో మాట్లాడుతూ.. ఢిల్లీ, దక్షిణ హర్యానా, నైరుతి యూపీ, పంజాబ్‌లో ఐదు నుంచి ఏడు రోజులు వేడి నమోదైందని.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44-48 డిగ్రీలుగా నమోదైనట్లు ఆయన తెలిపారు. అసోంలో మే 25-26 తేదీల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు. వాయువ్య భారతదేశం అంతటా మే రెండవ భాగంలో, మధ్య ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలలో వర్షాలు



లేకపోవడం, ఎక్కువ పొడి వాతావరణం, వేడిగాలులతో నైరుతి రాజస్థాన్, పొరుగున ఉన్న గుజరాత్‌లో తుఫాను వ్యతిరేక ప్రసరణ కారణంగా హీట్‌వేవ్స్‌కు కారణమన్నారు. ఇదిలా ఉండగా.. జూన్‌లో వాయువ్య భారత దేశం, మధ్య ప్రాంతంలోని అనుకుని ఉన్న ప్రాంతాల్లో హీట్‌వేవ్స్ కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఇక రుతుపవనాల సీజన్‌లో ఈ ఏడాది దేశంలో సాధారణం వర్షాపాతం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మోహపాత్ర తెలిపారు. వ్యవసాయోత్పత్తుల కోసం వేసవి వర్షాలపై ఎక్కువగా ఆధారపడే దేశానికి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు దోహదపడతాయని చెప్పింది. వ్యవసాయం, ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే కొద్ది రోజుల్లో కేరళలో వర్షపాతం కార్యకలాపాలు తీవ్రమయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈశాన్య భారతదేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం, వాయువ్యంలో సాధారణం, మధ్య-దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన రెమాల్ తుఫాను రుతుపవనాల పురోగతికి దోహదపడిందని పేర్కొంది. రుతుపవనాలతో త్వరలోనే కేరళలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది.

## పంజాబ్‌లో కాషాయ పార్టీ కనుమరుగు : అరవింద్ కేజ్రీవాల్




పంజాబ్ ప్రజలు కాషాయ పార్టీకి దీటైన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. అమిత్ షా ప్రకటనపై కేజ్రీవాల్ స్పందిస్తూ అమిత్ షాను రాష్ట్రానికి సంబంధించి మీ ఆలోచనలేంటని పంజాబ్ ప్రజలు అడగాలని కోరుకుంటున్నారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేజ్రీవాల్ సోమవారం భటిండాలో విలేకరులతో మాట్లాడారు. పంజాబ్‌లో 117 సీట్లకు గాను తమకు 92 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, బీజేపీకి కేవలం ముగ్గురు సభ్యులు మాత్రమే ఉన్నారని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈడీ, సీబీఐలను పంపుతారా లేక పంజాబ్ ప్రజలను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తారా అని కేజ్రీవాల్ కాషాయ పాలకులను నిలదీశారు. మీకు ఉచిత్ విద్యుత్ అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని 13 లోక్‌సభ స్థానాలను ఆప్‌నకు కట్టబెట్టండని ఆయన పంజాబ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తన మధ్యంతర బెయిల్‌ను ఏడు రోజులు పొడిగించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై కేజ్రీవాల్ స్పందిస్తూ తాను బరువు బాగా తగ్గానని, ఎలాంటి కారణం లేకుండా నెలలో 7 కిలోలు తగ్గితే తీవ్ర సమస్యని వైద్యులు చెప్పారని తెలిపారు. పలు పరీక్షలు నిర్వహించాలని వైద్యులు తనకు సూచించారని, వారం రోజుల్లో తాను అన్ని పరీక్షలు చేయించుకుంటానని చెప్పారు. శరీరంలో ఏదైనా తీవ్ర వ్యాధి ముంచుకొస్తున్నదా లేదా అనేది ఈ పరీక్షల్లో వెల్లడవుతుందని అన్నారు.

## పాక్షికంగా కుంగిన వేదిక.. రాహుల్ గాంధీకి తప్పిన ముప్పు

పాట్నా: ఎన్నికల సభ కోసం ఏర్పాటు చేసిన వేదిక పాక్షికంగా కుంగింది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి తృటిలో ముప్పు తప్పింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీహార్‌లోని పాలిగంజ్‌లో ఈ సంఘటన జరిగింది. సోమవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఇండియా బ్లాక్ నేతలు పాల్గొన్నారు.

## పార్టీలు ఇచ్చే హామీలు అవినీతిగా పరిగణించలేం

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన కామెంట్స్ చేసింది. పార్టీలు ఇచ్చే హామీలు అవినీతిగా పరిగణించలేమని స్పష్టం చేసింది సుప్రీం ధర్మాసనం ఎన్నికల్లో పార్టీలు చేసే వాగ్ధానాలు అవినీతి కిందకు రాదని తెలిపింది. హామీలు ఇవ్వడమే అవినీతికి కిందకు వస్తుందంటూ సుప్రీంకోర్టులో కొందరు పిల్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. పిల్‌ను విచారణకు అంగీకరించలేదు. పార్టీల మేనిఫెస్టోల్లోని హామీలను ప్రజలు నమ్మితే ఎవరేం చేస్తారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీనిని అవినీతిగా పరిగణించలేమని పిల్‌ను తోసిపుచ్చింది.



రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలను అవినీతిలో భాగంగా పరిగణించాలని కోరుతూ కొందరు సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. రాజకీయ పార్టీలు అధికారం చేపట్టేందుకు అలవిగాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని.. వీటి కారణంగా ప్రజలు ప్రలోభాలకు గురవుతున్నారని పిల్‌లో పేర్కొన్నారు. ఇష్టారీతిన మేనిఫెస్టోలు, హామీలు ఇచ్చి.. అధికారం చేపట్టిన తరువాత వాటిని విస్మరిస్తున్నారని అన్నారు. ఈ కారణంగా రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు కూడా అవినీతికి కిందకే వస్తాయని.. వీటిపై తగిన ఆదేశాలు ఇవ్వాలని పిల్‌లో కోరారు. దీనిని పరిశీలించిన ధర్మాసనం.. పిల్‌ను తిరస్కరించింది.

# గుజరాత్ సర్కార్‌పై శివాలెత్తిన హైకోర్టు

**రాజ్‌కోట్:** గుజరాత్‌లోని రాజ్‌కోట్ గేమింగ్ జోన్‌లో గత శనివారంనాడు జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో చిన్నారులతో సహా 27 మంది మరణించడంపై ఇప్పటికే గుజరాత్ సర్కార్‌పై తీవ్ర ఆక్షేపణ తెలిపిన రాష్ట్ర హైకోర్టు మరోసారి కస్సుమంది. సిటీలోని రెండు గేమింగ్స్ జోన్స్ గత రెండేళ్లుగా ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లతో సహా అవసరమైన పర్మిట్లు లేకుండా పనిచేస్తుండటంపై సోమవారంనాడు నిప్పులు చెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం, రాజ్‌కోట్ మున్సిపల్ యంత్రాగం నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ.. "మీరు గుడ్డిగా వెళ్తున్నారా? నిద్రపోతున్నారా? ఇప్పుడు మేము స్థానిక యంత్రాగాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎంతమాత్రం విశ్వసించలేం" అని వ్యాఖ్యానించింది. గేమింగ్ జోన్‌లో మున్సిపల్ అధికారులు ఉన్న కొన్ని ఫోటోలను రాజ్‌కోట్ మున్సిపల్ అధికారులు కోర్టు ముందుంచగా, వాటిపై కోర్టు మండిపడింది. "ఈ అధికారులెవరు? ఆలటలాడుకునేందుకు వెళ్లారా? అని ప్రశ్నించింది. ఫైర్ సేఫ్టీ సర్టిఫికేషన్ హియరింగ్స్ నాలుగేళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదంటూ కోర్టు ఆగ్రహం వ్యక్తం



చేసింది. స్థానిక యంత్రాగాన్ని కానీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని కానీ తాము విశ్వసించే పరిస్థితి కనిపించడం లేదని ఆక్షేపణ తెలిపింది. అహ్మదాబాద్‌లో నడుస్తున్న రెండు అదనపు గేమింగ్ జోన్ల అనుమతి లేకుండా పని చేస్తున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ మనీషా లవ్ కుమార్ షా అంగీరించారు. ఈ అంశాలపై ఇన్వెస్టిగేషన్‌కు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశామని, 72 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించామని ఆమె తెలిపారు. మాల్స్ లోపల 34 మినీ-గేమింగ్ జోన్స్ ఉన్నాయని, వాటిలో మూడింటికి ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు లేవని, వీటిపై కూడా ప్రత్యేక ఇనన్వెస్టిగేటింగ్ టీమ్ విచారణ జరుపుతుందని కోర్టుకు విన్నవించారు. కాగా, గేమింగ్ జోన్ యజమానులు ముగ్గురుని అరెస్టు చేస్తామని, తక్కిన అనుమానితులను కూడా పట్టుకుంటామని కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి హామీ ఇచ్చింది.

# పోలీసులకు డేట్.. టైమ్.. చెప్పిన ప్రజ్వల్

**బెంగళూరు :** రాసలీలల పెన్ డ్రైవ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీ(ఎస్) నేత, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తొలిసారి స్పందించారు. ఈ కేసులో మే 31వ తేదీ ఉదయం 10.00 గంటలకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు హాజరవుతానని ప్రజ్వల్ సోమవారం స్పష్టం చేశారు. ఈ కేసులో తాను పోలీసులకు సహకరిస్తానన్నారు. తనకు న్యాయవ్యవస్థలపైన చట్టాలపైన నమ్మకం ఉందని తెలిపారు. అయితే తనపై తప్పుడు కేసుల పెట్టారంటూ ప్రజ్వల్ ఈ సందర్భంగా ఆరోపించారు. అలాగే ఈ ఆరోపణలన్నీ రాజకీయ కుట్రలో భాగంగానే వచ్చినవేనన్నారు. జేడీ(ఎస్) నాయకులు, పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా ప్రజ్వల్ క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ప్రజ్వల్ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల జరుగుతున్న వేళ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన రాసలీలల పెన్ డ్రైవ్ బహిర్గతమైంది. దాంతో కర్ణాటకలో రాజకీయ దుమారం రేగింది. అదీకాక ఈ ఎన్నికల్లో జేడీఎస్‌తో బీజేపీ పొత్తు



పెట్టుకొని లోక్‌సభ ఎన్నికలకు వెళ్లింది. దీంతో ఆ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజ్వల్ అంశం ప్రచారాస్త్రంగా మారింది. అలాగే ప్రజ్వల్‌తోపాటు అతడి తండ్రి హెచ్ డి రేవణ్ణ బాధితులు పలువురు తనకు జరిగిన అన్యాయంపై పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రజ్వల్‌పై ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అయితే ప్రజ్వల్ రాసలీల వీడియోలు బహిర్గతం కావడంతో.. అతడు జర్మనీ వెళ్లిపోయాడు. ఆ క్రమంలో జేడీఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ప్రధాని దేవగౌడ్ కుటుంబంపై విమర్శలు వెల్లువెత్తాయి. అలాంటి వేళ దేవగౌడ.. తన మనవడు ప్రజ్వల్‌కు బహిరంగ లేఖ రాసి.. ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ప్రజ్వల్ ఎక్కడ ఉన్నా వెంటనే తిరిగి రావాలి, ఈ కేసులో పోలీసుల ఎదుట హాజరు కావాలన్నారు. అంతేకాదు.. ఈ కేసు విషయంలో తన సహనాన్ని పరీక్షించవద్దంటూ ప్రజ్వల్‌కు దేవగౌడ చురకలంటించారు. అలాగే ప్రజ్వల్‌పై ఆరోపణల నేపథ్యంలో గత కొన్ని వారాలుగా తమ కుటుంబం ఆవేదన అనుభవిస్తుందని దేవగౌడ ఈ సందర్భంగా వెల్లడించిన విషయం విధితమే. అయితే ప్రస్తుతం ప్రజ్వల్ ఎక్కడ ఉన్నది ఇంకా తెలియరాలేదు.

## కేజ్రీవాల్‌కు క్యాన్సర్ లక్షణాలు?

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బరువు తగ్గడంతో పాటు ఆయనకు కీటోన్ స్థాయిలు పెరిగాయని... ఇది ఆందోళనకు గురిచేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మంత్రి అతిషి అన్నారు. కేజ్రీవాల్‌లో కనిపిస్తోన్న లక్షణాలు తీవ్ర కిడ్నీ సమస్యలు లేదా క్యాన్సర్‌ను సూచిస్తున్నాయన్నారు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. తన బెయిల్‌ను మరో ఏడు రోజులు పొడిగించాలని కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో అతిషి మాట్లాడుతూ... కేజ్రీవాల్ అకస్మాత్తుగా బరువు



తగ్గడమనేది ఆందోళన కలిగించే అంశమన్నారు. కస్టడీ నుంచి బయటకు వచ్చాక వైద్యుల పరిశీలనలో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ తిరిగి బరువు పెరగడం లేదన్నారు. వైద్య పరీక్షల్లో అతని కీటోన్ స్థాయి చాలా ఎక్కువగా ఉందని తేలిందన్నారు. అధిక కీటోన్ స్థాయిలు, అకస్మికంగా బరువు పెరగడమనేది క్యాన్సర్‌తో పాటు కిడ్నీ సంబంధ వ్యాధులకు సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ పీఈటీ స్కాన్‌తో పాటు ఇతర పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించినట్లు చెప్పారు.

## ఖర్గేను కాంగ్రెస్ సాగనంపడం ఖాయం



**ఖుషీనగర్:** లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడగానే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన ఉద్యోగం కోల్పోనున్నారని కేంద్ర హెూం మంత్రి, బీజేపీ స్టార్ క్యాంపెయినర్ అమిత్‌షా జోస్యం చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని ఖుషీనగర్‌లో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ఓటమికి ఆ ఇద్దరి కవలలను బాధ్యులను చేయరని, వారిపై ఎలాంటి నింద రాకుండా ఖర్గేనే బాధ్యుడిని చేసి ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తారని, ఈ విషయాన్ని ఖర్గే గ్రహించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాహుల్ గాంధీ మనుషులు ఎన్నికల అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈవీఎంల వల్లే తాము ఎన్నికల్లో ఓడిపాయమని కూడా అంటారని అమిత్‌షా చెప్పారు.

**310 సీట్లు దాటేశాం..**

ఐదు విడతల పోలింగ్‌పై వివరాల తన వద్ద వద్ద ఉన్నాయని, ఆ ప్రకారం ఐదు విడతలు పూర్తయ్యేసరికి ప్రధాని మోదీ 310కి పైగా సీట్లు సొంతం చేసుకున్నారని చెప్పారు. రాహుల్ 40 దాటరని, అఖిలేష్ యాదవ్‌కు 4 సీట్లు కూడా రావని అన్నారు. ఈ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల్లో పుట్టి, దేశాన్ని ముందుకు తీసుకువెళ్తున్న మోదీ ఒకవైపు, వెండి స్పూన్‌తో పుట్టి, పూర్వాంచల్ సమస్యలు ఏమాత్రం తెలియని ఇద్దరు యువరాజులు (రాహుల్, అఖిలేష్) మరోవైపు ఉన్నారని అన్నారు. బీఎస్పీ చీఫ్ మాయావతి, అఖిలేష్ యాదవ్ హయాంలో అనేక చక్కెర మిల్లులు మూతపడ్డాయని, యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 20 చక్కెర మిల్లులను తిరిగి తెరిచిందని చెప్పారు. విపక్షాలు దళిత, వెనుకబడిన, గిరిజన వర్గాల రిజర్వేషన్లను ఊలలాక్కుని ముస్లింలకు ఇవ్వాల%జట% అనుకుంటున్నాయని, వారి ఆటలను బీజేపీ ఎంతమాత్రం సాగనీయదని అన్నారు. మొత్తం ఏడు విడతల లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా 7వ విడత పోలింగ్ జూన్ 1న జరుగనుంది. ఇందులో భాగంగా యూపీలోని ఖుషీనగర్ సహా 12 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ ఉంటుంది.

## 400 స్థానాల్లో బీజేపీకి ఓటమి తప్పదు



ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో 400కిపైగా స్థానాలు గెలుస్తామని బీజేపీ ఊదరగొడుతోందని, అయితే ఆ పార్టీ 400 స్థానాలు కోల్పోతుందని ఎస్పీ చీఫ్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఘజీపూర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి అఖిలేష్ మాట్లాడారు. యూపీలో విపక్ష ఇండియా కూటమి పట్ల ప్రజలు విశేష ఆదరణ కనబరుస్తుండటంతో ఢిల్లీ నుంచి వస్తున్న కాషాయ పాలకులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారని అన్నారు. మోదీ సర్కార్ పట్ల తొలి దశ పోలింగ్‌లో నెలకొన్న వ్యతిరేకత తుది దశకు చేరేసరికి జనాగ్రహంగా పెల్లుబికిందని చెప్పారు. బలియా, సేలంపూర్‌లో ఎస్పీ పట్ల ప్రజలు అత్యంత సానుకూలంగా ఉన్నారని, విపక్ష కూటమికి మద్దతు తెలుపుతూ వారు కేరింతలు కొట్టడాన్ని తాను స్వయంగా చూశానని అఖిలేష్ యాదవ్ వివరించారు. కాషాయ నేతల పాత డైలాగ్‌లను వినేందుకు ఏ ఒక్కరూ సిద్ధంగా లేరని, ఈ ఎన్నికల్లో వారికి ఘోర పరాజయం తప్పదని చెప్పారు.

## వామ్మో.. 16 కిలోల బంగారు బిస్కెట్లు.. పట్టుకున్న బీఎస్ఎఫ్

**కోల్‌కొతా:** గోల్డ్ స్మగ్లింగ్ ప్రయత్నాన్ని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్లు అడ్డుకున్నారు. ఒక ఇంటిని చుట్టుముట్టారు. గ్రామస్తుల సమక్షంలో తనిఖీ చేశారు. కోట్ల విలువైన బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు గ్రామంలోని ఒక ఇంట్లో స్మగ్లింగ్ కోసం భారీగా బంగారాన్ని దాచినట్లు బీఎస్ఎఫ్‌కు ఇంటెలిజెన్స్ సమాచారం అందింది. కాగా, బీఎస్ఎఫ్ అధికారులు, జవాన్లు ఆదివారం ఆ ఇంటిని చుట్టుముట్టారు. గ్రామస్తుల సమక్షంలో ఆ ఇంట్లో సోదాలు చేశారు. లోపల దాచిన 86 బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. 16.07 కేజీల బరువున్న గోల్డ్ బిస్కెట్ల విలువ రూ.12 కోట్లకుపైగా ఉంటుందని బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి దీని గురించి ప్రశ్నిస్తున్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com